## క్లుప్తంగా

### సమస్యలపై వినతి



డీటీ చంద్రశేఖర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న పీసా కమిటీ సభ్యులు

**చింతపల్లి:** పీసా మండల కమిటీ ఎన్నిక బుధవారం జరిగింది. కమిటీ ఉపాధ్యక్షుడిగా డి.రామకృష్ణ, గౌరవ అధ్యక్షులుగా ఎస్.వెంకటరమణ, ఎస్.రామారావు, జి.నాగేశ్వరరావులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన చట్టాలు, హక్కులను పరిరక్షించడమే లక్ష్యంగా పీసా కమిటీలు పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా మండలంలో సమస్యలపై వినతి పత్రాలను స్థానిక డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖరుకు, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ రామారావుకు అందించారు.

### నిస్వార్థ సేవలతోనే గుర్తింపు

**హుకుంపేట:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన తహసీల్దార్ జయప్రకాష్‌కు బుధవారం సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగులు తహసీల్దార్ జయప్రకాష్‌ను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఆర్‌వో పద్మలత మాట్లాడుతూ చిత్తశుద్ధి, నిస్వార్థ సేవలతో ఉద్యోగులకు గుర్తింపు ఉంటుందన్నారు.తహసీల్దార్ జయప్రకాష్ సేవలను కొనియాడారు. ఏవో పోలరాజు, ఆర్‌ఐ సీతమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పాడేరు రూరల్:** విద్యుత్ మరమ్మతు పనుల నేపథ్యంలో ఈనెల 2న విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ ఈఈ ఎ.వి.ఎస్.ఎం.అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు సబ్ డివిజన్‌లోని జి.మాడుగుల సబ్ స్టేషన్ పరిధిలో జి.మాడుగుల పట్టణం, పాత జి.మాడుగుల, కొత్తూరు, గాంధీనగర్, అరకు సబ్ స్టేషన్ పరిధిలో సుంకరమెట్ట, చొంపి, మాడగడ, శిరగం, కొత్తభల్లుగుడ, పెదబయలు మండలంలో రూడకోట, తమరాడ, వడ్డెపుట్టు, బొంగరం, డుంబ్రిగుడ మండలంలో కురిడి, సాగర, గసభ, కొల్లపుట్టు, కొయ్యూరు మండల పరిధిలోని కృష్ణదేవిపేట, నాగపురం, తోటలూరు, కితలోవ, కొప్పుకొండ, వైఎస్ పాకలు, బొయిట కొత్తవీధి, దారకొండ సబ్ స్టేషన్ పరిధిలో దారకొండ, ధర్మాపురం, పీటరాయి, అగ్రహారం గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వినియోగదారులందరూ సహకరించాలని ఆయన తెలిపారు.

### ఐటీడీఏ ఏపీవో ప్రభాకరరావుకు ఘన సన్మానం



ఐటీడీఏ ఏపీవో ప్రభాకరరావు దంపతులను సన్మానిస్తున్న ఏపీవో వెంకటేశ్వరరావు

**సాక్షి,పాడేరు:** ఉద్యోగ విరమణ పొందిన ఐటీడీఏ అదనపు ప్రాజెక్టు అధికారి(జనరల్) వి.ఎస్.ప్రభాకరరావును అధికారులు, ఉద్యోగులు బుధవారం రాత్రి ఘనంగా సన్మానించారు. గిరిజన సంక్షేమశాఖలో మూడు దశబ్దాల పాటు గిరిజన సంక్షేమానికి ఉత్తమ సేవలు అందించిన ఏపీవో ప్రభాకరరావు సేవలను అందరూ కొనియాడారు. ఏపీవో ప్రభాకరరావు దంపతులను ఐటీడీఏ ఏపీవో(పీవీటీజీ) వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ మురళీ, ఇన్‌చార్జి డీడీ రజనీ, ఐటీడీఏ ఏవో హేమలత, ఏవో శ్రీనివాసరావు, జిల్లా సెరీకల్చర్ అధికారి అప్పారావు, ఏపీఎంఐపీ పీడీ రహీం, పలు శాఖల అధికారులంతా శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలను అందజేసి ఆత్మీయ వీడ్కోలు పలికారు.

### సందడిగా స్వామివారి పెళ్లిరాట

**చోడవరం :** శ్రీ ఆపదహర శ్రీనివాస క్షేత్రంగా బాసిల్లుతున్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక, స్వామివారి కల్యాణోత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. మే 8వ తేదీన శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీనివాసుని కల్యాణోత్సవాలు వైభవంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారి పెళ్లి రాట బుధవారం వేసి ఉత్సవాలను ప్రారంభించారు. చోడవరం కోఆపరేటివ్ కాలనీలో వేంచేసి యున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పెళ్లిరాట వేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు శాంతారామచార్యులు, వాసు ఆధ్వర్యంలో వేదపండితులు మంత్రోచ్ఛరణ మధ్య స్వామివారి పెళ్లిరాట వేశారు.

ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ వింజుమూరి శంకర్, దేవాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వివి సత్యనారాయణమూర్తి, ఆలయ కమిటీ ప్రతినిధులు ఉపాధ్యాయుల శ్రీనివాస్, సకురు కోటేశ్వరరావు, దేరవపల్లి వెంకటఅప్పారావు పాల్గొన్నారు.

# వెతలు ఇంకెన్నాళ్లు?

- అసంపూర్తి పనులతో వాహనచోదకుల అవస్థలు
- చినుకు పడితే చిత్తడిగా మారుతున్న దారి
- ఫుట్‌పాత్‌ల ఆక్రమించి యథేచ్ఛగా వ్యాపారాలు
- పాదచారుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు



బిట్రగండలో అసంపూర్తిగా దర్శనమిస్తున్న రోడ్డు, వంతెన



వి.ఆర్.పురంలో నిరుపయోగంగా వాటర్ ట్యాంక్

**డుంబ్రిగుడ:** మండలంలోని కొల్లాపుటు పంచాయతీ బిట్రగండ గ్రామానికి అనుసంధానం చేస్తు నిర్మిస్తున్న కల్వర్టు పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. దీంతో చిన్నపాటి వర్షం పడితే రాకపోకులకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఈ మార్గంలో వర్షం పడతే చిత్తడిగా మారడంతో వాహనచోదకులు, పాదచారులు జారిపగి, గాయాలపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం గ్రామస్తుల పాలిట శాపంగా మారిందంటున్నారు. కాంట్రాక్టర్ పనులను అసంపూర్తిగా వదిలేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు మార్గంలో బూసిపుట్టు కూడలి నుంచి బలియాగుడ, బిట్రగండ, నందివలస, ముస్నిగుడ గ్రామాలకు అనుసంధానం చేస్తూ గతంలో రూ.కోటి 50 లక్షల నిధులతో బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. పూర్తిస్థాయిలో రోడ్డుతో పాటు కల్వర్టు నిర్మాణ పనులు చేయకుండా మధ్యలో వదిలేయడంతో ఈ దుస్థితి ఏర్పడిందని గ్రామస్తులు చెబుతున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

**ఫుట్‌పాత్‌పై అక్రమంగా దుకాణాలు**

మండలంలోని నూతనంగా నిర్మించిన జాతీయ రహదారిపై పాదచారుల సౌకర్యార్థం నడవడానికి ఏర్పాటు చేసిని ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురయ్యాయి. కొంతమంది ఆక్రమణదారులు అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్ ఏర్పాటు చేసి సోలార్ లైట్‌లను ఏర్పాటు చేసేందుకు కొంత స్థలాన్ని కేటాయించారు. వాటిని పట్టించుకోకుండా ఫుట్‌పాత్‌ను ఆనుకొని దుకాణాలు ఏర్పాటుచేశారు. దీంతో పాటు దుకాణాల ఏర్పాటుకు లక్షలాది రూపాయల అడ్వాన్స్ వసూలు చేసి గిరినేతరులకు అద్దె ఇస్తున్నారని పలువురు చెబుతున్నారు. గిరిజనుల అండతో గిరిజనేతరులు రెచ్చిపోయి అడ్డు అదుపు లేకుండా అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారని, పాదచారులు నడిచేందుకు కూడా వీలు లేని పరిస్థితి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఫుట్‌పాత్‌ల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



డుంబ్రిగుడ హైవేలోని ఫుట్‌పాత్‌పై ఏర్పాటుచేసిన దుకాణాలు

**గ్రామాల్లో తాగునీటి ఎద్దడి**

వి.ఆర్.పురం: మండలంలోని మొద్దులగూడెం, తోటపల్లి గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పది రోజులుగా తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని, సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదంటున్నారు. మొద్దులగూడెంలో ఏర్పాటుచేసిన ట్యాంకునుకు నీరు సరఫరా చేసి పైపు పగలడంతో నీరంతా వృథాగా పోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా ఈ గ్రామంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా పైపులైన్ వేసి, మోటార్ బిగించి వదిలేశారని ఏడాదవుతున్నా నీటి సరఫరా చేయ్యలేదని స్థానికులు చెబుతున్నారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని లేనిపక్షంలో పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని గ్రామస్తులు రమేష్, శ్రీనివాసు, గోవిందు, రామారావు తదితరులు చెబుతున్నారు. ఈ విషయంపై ఆర్ డబ్ల్యూఎస్ జేఈ సాయిరామ్ మాట్లాడుతూ పైపు లైన్ మరమ్మతుకు ప్రతిపాదనలు పంపామని, త్వరలో సమస్య పరిష్కరిస్తామన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

## టెన్త్ టాపర్లకు సన్మానం



టాపర్ ఆశా లిల్లీని సన్మానిస్తున్న ఎంఈవోలు, ఏటీడబ్ల్యూవో, హెచ్ఎం ఉపాధ్యాయులు

**పెదబయలు:** విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించడం ఆనందంగా ఉందని ఎంఈవోలు కొమ్ము కృష్ణమూర్తి , పుష్పజోసెఫ్ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో 2025 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన ఎస్టీ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు చెందిన మండి ఆశా లిల్లీకి రూ.5వేల నగదు బహుమతి, ద్వితీయ స్థానంలో నిలిచిన అరడకోట గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలకు చెందిన కోడ పరమేష్‌కు రూ.4 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన పెదబయలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నేరోడి సందీప్ శివకు రూ.3 వేలు, సీతగుంట ఆశ్రమ పాఠశాలకు చెందిన వెచ్చంగి జోష్నకు రూ.2 వేల నగదు బహుమతిలో పాటు వారందరికీ శాలువా కప్పి సన్మానించారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలను సన్మానించారు.ఈ కార్యక్రమానికి మండల ఉప గిరిజన సంక్షేమశాఖ అధికారి కె.స్వర్ణలత, ఆయా పాఠశాల హెచ్ఎంలు నాగేశ్వరరావు, చిట్టమ్మ యూటీఎఫ్, ఏపీటీఎఫ్, పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సత్యనారాయణ, కమలకుమారి, ఛాయారత్నం, మాలం నాయుడు, ఉమామహేశ్వరరావు విద్యార్థులు, తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ధ్రువపత్రాలను వేగవంతంగా అందజేయాలి



జీకే వీధిలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు



చింతపల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

**చింతపల్లి:** మండలంలో పెన్షన్ రీ సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనన, మరణ ధ్రువపత్రాల మంజూరుతో పాటు చిన్న పిల్లలు ఆధార్ నమోదు తదితర కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రభుత్వ లక్ష్యాలకనుగుణంగా పనులు**

**గూడెంకొత్తవీధి:** ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలు వచ్చేలా పనిచేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు చేరువ చేయాలన్నారు . ప్రధానంగా పింఛన్ల పంపిణీ సకాలంలో చేపట్టాలన్నారు. ఈవోపీఆర్డీ పాపారావు, పలు పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి వితరణ



అగ్ని బాధిత కుటుంబానికి నిత్యావసర సరకులు అందజేస్తున్న దాత కృష్ణార్జునరావు

**వి.ఆర్.పురం:** ఇటీవల చొక్కనపల్లి గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమైన సర్వం కోల్పోయిన బాధితుడు తోడం రాంబాబు కుటుంబానికి కృష్ణార్జున ఫౌండేషన్ సంస్థ చేయూత అందించింది. ఇందులో భాగంగా సంస్థ అధ్యక్షుడు కాకునూరి కృష్ణార్జునరావు తదితరులు అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి బియ్యం, దుప్పట్లు, సబ్బులు, వంటనూనె, కూరగాయలు తదితర నిత్యావసర సరకులను బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉప సర్పంచ్ తోడం బాయమ్మ మాట్లాడుతూ మారుముల గ్రామమైన చొక్కనపల్లికి వచ్చి నిత్యావసర సరకులు అందజేయడం చాలా గొప్ప విషయమన్నారు. గ్రామం తరపున కృష్ణార్జునరావు ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామపెద్ద తోడం రాజు, పులి ధర్మరాజు, వార్డు సభ్యుడు గోంది దారయ్య, తోడం అనిల్, తోడం మంగమ్మ, తోడం సీతారామరాజు, నోముల శ్రీనివాసురావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అమ్మవారి ఉత్సవాలు



కొండపై వెలసిన అమ్మవారి గృహానికి వెళ్తున్న భక్తులు



మల్లమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు

**డుంబ్రిగుడ:** మండలంలోని సాగర పంచాయతీ అడపవలస గ్రామంలో మల్లమ్మతల్లి గృహ జాతర మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర–ఒడిశా ప్రాంత భక్తులు అమ్మవారిని సందర్శంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కొండపై వెలసిన అమ్మవారి గృహానికి మెట్ల మార్గం ద్వారా చేరుకొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. స్థానికులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సాయంత్రం థింసా, ఒడియా భాగవతం, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమాలు నిర్వహించారు.

## గ్రామస్థాయిలో హెల్త్ కమిటీల ఏర్పాటు



ఎంపీపీ నీలవేణితో చర్చిస్తున్న ఎయిమ్స్ ప్రతినిధులు

**అనంతగిరి (అరకులోయ టౌన్):** గ్రామస్థాయిలో హెల్త్ కమిటీలు ఏర్పాట్లు చేయడానికి సహకరించాలని ఎయిమ్స్ ప్రతినిధులు దిలీప్ తదితరులు అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణిని కోరారు. మండల కేంద్రంలోని ఎంపీపీ నీలవేణిని వారు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఎయిమ్స్ కో–ఆర్డినేటర్ దిలీప్, సిబ్బంది ఎంపీపీతో మాట్లాడుతూ ప్రతి పంచాయతీ పరిధిలో ఈ కమిటీల ఏర్పాటుపై చర్చించారు. ఇందులో భాగంగా పంచాయతీలో సర్పంచ్ హెల్త్ కమిటీ చైర్మన్‌గా, ప్రతి గ్రామం నుంచి ఒకరు ప్రతినిధిగా సభ్యులతో కూడిన కమిటీలను ఏర్పాటుచేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంపీపీ నీలవేణి ఈ నెలలో జరిగే మండల సర్వసభ్య సమావేశంలో కమిటీలు ఏర్పాటుపై చర్చించేందుకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన



సీకరిలో సామాజిక భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

**పెదబయలు:** సీకరి పంచాయతీ కేంద్రంలో ఎంపీ నిధులతో నూతన సామాజిక భవనం నిర్మాణానికి రూ.30 లక్షలతో నిర్మిస్తున్నట్టు అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని సీకరి పంచాయతీ కేంద్రంలో సామాజిక భవనం(కమ్యూనిటీ హాల్) నిర్మాణానికి భూమి పూజ చేసి కొబ్బరికాయ కొట్టారు. ఈ కార్యక్రమానికి అరకు ఎంపీ గుమ్మా తనూజరాణి, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం వారి చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం చేయాల్సి ఉన్న అనివార్య కారణాల దృష్ట్యా హాజరు కాలేదన్నారు. భవనం నిర్మాణం పూర్తయితే వారి చేతులు మీదుగా ప్రారంభోత్సవం చేస్తామన్నారు. సామాజిక భవనం లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ కార్యక్రమాలు జరిగే సమయాల్లో ఆరుబయట జరపాల్సిన పరిస్థితి ఉందని, వర్షాకాలంలో అయితే చాలా అవస్థలు పడుతున్నారన్నారు. నూతన సామాజిక భవన నిర్మాణం పూర్తయితే గ్రామస్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మాజీ ఎమ్మెల్యేకు పంచాయతీ ఉద్యోగులు, స్థానికులు ఘనంగా సన్మానించారు. పంచాయతీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. జెడ్పీటీసీ సభ్యుడు కూడ బొంజుబాబు, వైస్ ఎంపీపీ కొర్రా రాజుబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మజ్జి చంద్రుబాబు, ఎస్టీ సెల్ జిల్లా వైస్ చైర్మన్ కాతారి సురేష్‌కుమార్, మాజీ ఎంపీపీ సల్లంగి ఉమామహేశ్వరరావు, సర్పంచ్ గుల్లేలు కృష్ణారావు, ఎంపీటీసీ సభ్యుడు వంతాల ఆనందరావు, నాయకులు సందడి కొండబాబు, పాంగి సింహాచలం, గుమ్మా శ్యాంసుందర్, తెరవాడ వెంకటరావు, ధనలక్ష్మీ, బీజేపీ నాయకులు చిన్నయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పీవీటీజీలకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

**అనంతగిరి(అరకులోయటౌన్):** మండలంలోని పీవీటీజీల కోసం ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీవో ఏ.వి.వి. కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అనంతగిరి, చిలకలగెడ్డ, గరుగుబిల్లి, పినకోట, కొత్తూరు గ్రామాల్లో ఆధార్ కార్డులు లేని సుమారు 548 మంది పీవీటీజీల కోసం బుధవారం నుంచి ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఆధార్ కార్డు చేయించుకునే వారు కుల ధ్రువీకరణ పత్రం తోపాటు నివాస, జనన ధ్రవపత్రాలు ముందుగా చేయించుకోవాలని సూచించారు. కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, పివీటీజీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కుమార్ కోరారు.

## ఆరోగ్య బీమాపై అవగాహన



బీమా పత్రాలను అందజేస్తున్న వైద్యులు

**రంపచోడవరం:** కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ) సభ్యుల సమావేశం బుధవారం రంపచోడవరంలో జరిగింది. రాజమండ్రికి చెందిన సన్ స్టార్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ సౌజన్యంతో సభ్యులకు పోస్టల్ ఇన్సూరెన్స్ చేయించారు. ఇన్సూరెన్స్ బాండ్‌లను పీఎంపీ కేంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వీబీటీ రాజు, తోరాటి ప్రభాకరరావుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇన్సూరెన్స్ చేయించుకోవడం వలన కుటుంబాలకు భద్రత ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ జె.కోదండరామ్ మాట్లాడుతూ అధిక రక్తపోటు వల్ల వచ్చే ఇబ్బందుల్లో పక్షవాతం ఒకటని వివరించారు. మూడు గంటల లోపు రోగిని ఆసుపత్రికి తీసుకువస్తే పక్షవాతం బారినపడకుండా కాపాడవచ్చన్నారు. అధిక రక్తపోటుకు తీసుకువలసిన జాగ్రత్తలను సూచించారు. పీఎంపీలు అందించే ప్రథమ చికిత్సలను వివరించారు.

## డీఎస్సీలో గిరిజనులకు న్యాయం జరిగే వరకు పోరాటం



వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు గబ్బాడి శేఖర్



ముంచంగిపుట్టులో మాట్లాడుతున్న డీఎస్సీ సాధన సమితి మండల కన్వీనర్ సుధీర్‌కుమార్

**ముంచంగిపుట్టు:** కూటమి ప్రభుత్వం ప్రత్యేక ఆదివాసీ డీఎస్సీ ప్రకటించి గిరిజనులకు న్యాయం చేసే వరకు పోరాటం ఆగదని గిరిజన ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ మండల కన్వీనర్ మినుముల సుధీర్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో స్థానిక కళ్యాణ మండపంలో గిరిజన ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో గిరిజన నిరుద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం చేసిందని, 96శాతం గిరిజనేతరులకు ఉద్యోగాలు కట్టబెడుతుందన్నారు. అరకువేలిలో బహిరంగ సభలో చంద్రబాబునాయుడు జీవో నెంబర్ 3ను ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పునరుద్దరణ చేస్తామని మాట ఇచ్చి నేటికి హామీని నెరవేర్చకుండా గిరిజన జాతిని మోసం చేశారన్నారు. ఆదివాసీ నిరుద్యోగులు అంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. గిరిజన సంఘం మండల అధ్యక్షులు ఎంఎం.శ్రీను, సాధన సమితి నాయకులు పవన్, రమేష్, లైకోన్, శ్రావణ్, సూర్యనారాయణ, చందు, జగన్నాథం పాల్గొన్నారు.

**గిరిజనులను మోసం చేసిన కూటమి ప్రభుత్వం**

**జి.మాడుగుల:** కూటమీ ప్రభుత్వం డీఎస్సీ అంటూ ప్రకటించి గిరిజన నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేసిందని వైఎస్సార్‌సీపీ యూత్ ఏఎస్సార్ జిల్లా అధ్యక్షుడు గబ్బాడి శేఖర్ ధ్వజమెత్తారు. విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో డీఎస్సీ పోస్టులు ఈ ప్రాంత అభ్యర్థులకే వస్తాయని ఆశించారని కానీ కూటమీ ప్రభుత్వం మాత్రం ఆకలితో ఉన్నవారికి ఎంగిలి ఆకు విసిరినట్టు డీఎస్సీ ప్రకటించిందని ఆయన విమర్శించారు. గిరిజన ప్రాంతంలో గల డీఎస్సీ పోస్టులన్నీ గిరిజన యువతతో భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రత్యేక డీఎస్సీ కోసం మే 2న తలపెట్టిన గిరిజన ప్రాంత బంద్‌కు వైఎస్సార్‌సీపీ మద్దతు ఉంటుందని ఆయన ప్రకటించారు. ప్రతీ ఒక్కరు పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ఆలయ వార్షికోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యుడు మత్స్యరాజు

**జి.మాడుగుల:** గాంధీనగర్ లోని హనుమా సేవాశ్రమం పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని మే 22 నుంచి 25వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్టు సమరసత సేవా ఫౌండేషన్ సభ్యుడు మత్స్యరాస మత్స్యరాజు తెలిపారు. ఈ మేరకు ఆలయం ఆవరణలో బుధవారం పోస్టర్‌లను భక్తులు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం భీమిలి సద్గురు సేవాశ్రమం, గాంధీనగర్ హనుమ సేవాశ్రమం ప్రతినిధి స్వామిజీ అధ్వర్యంలో ఈ నెల 22న స్వామి వారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. అదే రోజు సాయంత్రం రామ భజన, 23న భక్తి గాన సుధ హనుమ శృతిలయ భజన, హనుమ గానామృతం భజన కార్యక్రమాలు, 24న రామ నామ సంకీర్తన భజన సర్వ దేవత రాగసుధ భజన, 25న హనుమ శోభాయాత్రను పాకలపాటి గురు సన్నిధి వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. అనంతరం భారీ అన్నసమారాధన జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. నాయకులు శ్రీను, చంద్రమణి పాల్గొన్నారు.

## మన్యంలో భారీ వర్షం



రాజవొమ్మంగిలో కురుస్తున్న వర్షం



హుకుంపేటలో కురుస్తున్న వర్షం

**హుకుంపేట:** మన్యంలో పలుచోట్ల బుధవారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గాలి వానతో పాటు ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో గిరిజనులు భయందోళన చెందారు.

**రాజవొమ్మంగి:** మండలంలో బుధవారం సాయంకాలం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. రోడ్లపై నీరు ప్రవహించింది. పిల్లకాలువలు, పల్లపు ప్రాంతాల్లో వర్షం నీరు ప్రవహించింది. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. పలు చోట్ల చెట్లు, చెట్ల కొమ్మలు విరిగిపడడంతో విద్యుత్ తీగలపై పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో అంధకారం అలముకొంది. బస్సులు ఆలస్యంగా తిరిగాయి. రాత్రి 8 గంటలకు వర్షం తగ్గినా కరెంటు లేకపోవడంతో ప్రజలు అంధకారంలోనే గడపాల్సి వచ్చింది.